# సొట్టబుగ్గ సుందరి

-అరుణ

బస్సు నెమ్మదిగా వెళుతోంది.

"పైన మేడ కడుతున్నామని ఇంతకుముందు కనిపించినప్పుడు మీ అమ్మ చెప్పింది. పనులు బాగా జరుగుతున్నాయా?"

ముందు సీటులో కూర్చున్న మధ్యవయసు మహిళ పక్కన ఉన్న యువతిని అడుగుతోంది.

కిటికీలో నుండి బయటికి చూస్తున్న గౌరవ్ తలతిప్పి వారివైపు చూశాడు.

"పనులు పూర్తయ్యాయి పిన్నీ! కింద రెండు పోర్షన్లు అద్దెకు ఇచ్చి మేం మొదటి అంతస్తులో ఉంటున్నాం" ఆ అమ్మాయి చెప్పింది.

"మరి రెండో అంతస్తులో?" సందేహంగా అడిగింది మధ్య వయసావిడ.

"రెండో అంతస్తు ఫ్రీగా ఇచ్చేశాం" ఆ అమ్మాయి నవ్వుతూ సమాధానం ఇచ్చింది.

"ఫ్రీగా ఇచ్చేశారా? ఎవరికీ?" తెల్లబోతూ అడిగింది.

"అవును. సూర్యుడికి, చంద్రుడికి, నక్షత్రాలకు, పక్షులకు ఫ్రీగా ఇచ్చేశాం. పైన ఇక కట్టడలు చుకోలేదు నాన్న" సరదాగా జవాబు చెప్పింది ఆ అమ్మాయి.

తన ముందుసీటులో కూర్చున్న ఇరవైయేళ్ల అమ్మాయి సెన్సాఫ్ హ్యూమర్‌కి ముచ్చటగా అనిపించింది గౌరవ్‌కు.

ఉన్నతమైన సంస్కారం, విశాలమైన భావాలు ఉంటే తప్ప అంత అందంగా మాట్లాడలేరు.

ఆ అమ్మాయి వైపు పరిశీలనగా చూశాడు. తల కొద్దిగా పక్కకు తప్పి మధ్య వయసు మహిళతో మాట్లాడుతోంది.

నవ్వినప్పుడు ఆ అమ్మాయి కుడిబుగ్గమీద సొట్ట స్పష్టంగా కనిపిస్తోంది. చామనఛాయకి నిరాడంబరంగా ఉన్న ఆమె ముఖంలో సొట్టబుగ్గ ప్రత్యేకమైన అందాన్ని తెచ్చిపెట్టింది.

దూరపు బంధువులైన ఆ ఇద్దరూ అనుకోకుండా ఒకే బస్సు ఎక్కి పక్కపక్కన కూర్చుని ప్రయాణం చేస్తున్నారని అతనికి అర్థమైంది.

"ఈసారి ఉయ్యూరు వచ్చినప్పుడు తప్పకుండా ఇంటికి రా పిన్నీ!" ఆ అమ్మాయి అంటోంది.

"నీ పెళ్లికి వస్తానులే" మధ్యవయసావిడ సమాధానం ఇచ్చింది.

కంకిపాడులో బస్సు ఆగింది.

"మీ అమ్మను అడిగినట్టు చెప్పు తులసీ! ఇక్కడ దిగి సరుకులు తీసుకుని రిక్షాలో మా ఊరు వెళతాను" ముందు సీటులో కూర్చున్న యువతితో చెప్పి బస్సు దిగింది పెద్దామె.

'తులసి. పేరు బావుంది' అనుకున్నాడు గౌరవ్ మనసులో.

నలుగుర్ని దింపి మరో అరడజను మందిని ఎక్కించుకుని బస్సు బయల్దేరింది మళ్లీ.

ఉయ్యూరు సెంటర్‌లో బస్సు దిగింది ఆ అమ్మాయి. మరోసారి ఆమె వైపు చూడాలనిపించినా సభ్యత కాదనుకుని ఊరుకున్నాడు గౌరవ్.

బస్సు దిగి రోడ్ క్రాస్ చేసి వెళుతోంది ఆమె. పొడవాటి జడ లయబద్ధంగా కదులుతోంది ఆమె నడకకు అనుగుణంగా. ఎర్రబస్సు బయల్దేరింది.

పామర్రులో బస్సు దిగి అక్క వాళ్ల ఇంటికి చేరుకున్నాడు గౌరవ్.

మర్నాడు జరిగే మేనల్లుడి అన్నప్రాసన వేడుకకు చెన్నై నుంచి వచ్చాడతను.

చెన్నైలో ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడతను. మనుమడి అన్నప్రాసన వేడుక చూసేందుకు ఆ రోజు ఉదయమే ఏలూరు నుండి గౌరవ్ తల్లిదండ్రులు వచ్చారు.

"అమ్మా! గౌరవ్‌కు పెళ్లి సంబంధం వచ్చింది. మా చిన్నత్తగారి బంధువుల అమ్మాయి విజయవాడలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతోంది. మా చిన్నత్తగారు చూచాయగా ఈ విషయం చెప్పారు. మంచిరోజు చూసుకుని ఏలూరు వచ్చి మిమ్మల్ని ఈ విషయం అడుగుతారని నాకర్థమైంది" గౌరవ్ అక్క అంటోంది.

"చూద్దాం! ఎవరికి ఎక్కడ రాసి పెట్టి ఉందో మరి! ఒకరి ఆస్తి మరొకరి దక్క వచ్చునేమో గానీ ఒకరి ఆలి మరొకరికి దక్కదు అని పెద్దవాళ్ళు చెబుతారు. కట్నం విషయంలో మనకు ఎలాంటి ఆశలు లేవు. అమ్మాయి వాడికి నచ్చాలి. పెళ్ళిచేసుకుని భార్యతో సంతోషంగా ఉండాలి. అదే నా కోరిక" తల్లి అంటోంది.

మేనల్లుడిని ముద్దు చేస్తూ వారి వద్దకు వచ్చి కూర్చున్నాడు గౌరవ్.

తన మనసులో కోరిక తల్లితో చెప్పాలనిపించింది.

"అమ్మా! నాకు కాబోయే భార్య సాధారణమైన అందంతో ఉంటేచాలు. కానీ బుగ్గమీద సొట్ట ఉంటే బావుంటుంది" అన్నాడు.

అతని తల్లి, అక్క పెద్దగా నవ్వేశారు.

"సొట్టబుగ్గ ఉన్న అమ్మాయి భార్య కావాలని కోరుకుంటున్నావు. కష్టమేరా తమ్ముడూ! వధువు కావలెను, బుగ్గమీద సొట్ట ఉన్న అమ్మాయికి ప్రాధాన్యత అని పేపర్‌లో ప్రకటన ఇప్పిద్దాం" అతని అక్క ఇంకా నవ్వుతూనే ఉంది.

ఐఐటిలో ఇంజనీరింగ్ చదివిన ఇరవై ఐదేళ్ళ గౌరవ్ అక్క మాటలకు సిగ్గుపడ్డాడు.

"నువ్వు మనస్ఫూర్తిగా ఇష్టపడిన అమ్మాయితోనే నీ పెళ్లి జరుగుతుంది. నీ ఇష్టం లేకుండా మేము తొందరపడి సంబంధం సెటిల్ చేస్తామని భయపడవద్దు. నీ ఆనందం కంటే మాకేం కావాలి కన్నా!" ఆర్తిగా అంది అతని తల్లి.

చలించిపోయాడు గౌరవ్.

"ఊరకే సరదాగా అన్నానమ్మా! బుగ్గమీద సొట్ట ఉన్న అమ్మాయి అయితే బావుంటుందనిపించింది. మీకిష్టమైన అమ్మాయి మెడలో తాళికడతాను. మిమ్మల్ని నేను మాత్రం ఎందుకు బాధపెడతాను?" అన్నాడు.

అతనికి తెలుసు. తల్లిదండ్రులు తనను ఏవిషయంలోనూ బాధపెట్టరని.

మర్నాడు అన్నప్రాసన వేడుక కనులపండువగా జరిగింది. సుమారు డెబ్బై మంది బంధుమిత్రులు వచ్చారు. పెన్ను పట్టుకున్నాడు మేనల్లుడు.

"మేనమామలాగా బుద్ధిమంతుడైతే చాలు" పిల్లవాడి నాయనమ్మ దిష్టితీసి ముద్దుపెట్టుకుంటూ

అంది.

నవ్వుకున్నారందరూ.

సాయంత్రం తల్లిదండ్రులతో కలిసి ఏలూరు బయల్దేరాడు గౌరవ్.

రెండురోజులు సొంత ఇంట్లో అమ్మానాన్న లతో గడిపి చెన్నై తిరిగి వెళ్లాడు.

అతని తల్లిదండ్రులు ఎలా కష్టపడ్డారో తెలీదు. మరో పదిహేనురోజుల తర్వాత కొరియర్‌లో వచ్చిన కవర్‌లో ఇద్దరు అమ్మాయిల ఫోటోలు ఉన్నాయి.

వారి వివరాలు తెలుపుతూ అతని తండ్రి రాసిన ఉత్తరం కూడా ఉంది. ఇద్దరికీ సొట్టబుగ్గ ఉందని రాశాడాయన.


మొదటి ఫోటో చూశాడు.

పేరు మదాలస.

ఫోటోకు జతచేసిన వివరాలు చదివాడు. స్వగ్రామం తెనాలి వద్ద మున్నంగి. ఎంసిఏ చదివి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది.

మరో ఫోటో చూశాడు. పరిచయమైన ముఖం లాగా అనిపించింది. ఫోటో వెనక్కి తిప్పిచూశాడు.

పేరు తులసి.



చటుక్కున జ్ఞాపకం వచ్చింది.

ఆరోజు బస్సులో తన ముందు సీటులో కూర్చున్న అమ్మాయి.

ఆమె వివరాలు చదివాడు.

ఊరు ఉయ్యూరు. బికాం పూర్తయింది. సంతోషంగా తులసి ఫోటో జేబులో పెట్టుకున్నాడు.

మదాలస ఫోటోను తండ్రికి అదేరోజు కొరియర్‌లో తిప్పి పంపాడు.

పెళ్లిచూపుల్లో చిరునవ్వులు చిందించాడు తప్ప తులసితో ఏమీ మాట్లాడ లేకపోయాడు.

* * *

రెండు నెలల తర్వాత తులసి, గౌరవ్ దంపతులయ్యారు.


మర్నాడు రాత్రి తొమ్మిది గంటలైంది.

ఆరోజు వారి తొలి సమాగమానికి ముహూర్తం నిర్ణయించారు.



## డిమాండ్

తెలుగు సినిమాల్లో నటిస్తూ తెలుగు సంస్కృతిని వంటబట్టించుకుంటున్న తారలు ఎక్కువైపోతున్నారిప్పుడు. 'దేవదాసు'తో తెరంగేట్రం చేసిన అందాలజవ్వని ఇలియానా మహేష్‌బాబు కొత్త చిత్రం 'పోకిరి' సూపర్‌హిట్‌తో మంచి ఫాలోయింగ్‌ని సంపాదించుకుంది. తాజాగా ఎ.ఎం.రత్నం తనయుడు జోతికృష్ణ దర్శకుడిగా రూపొందుతున్న కొత్త చిత్రం 'జాదూ'లో రవికృష్ణ నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో అందాల భామ ఇలియానాతో పాటూ తమన్నా కూడా హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం ఆడియో ఈమధ్యే విడుదలైంది. కేడీ పేరుతో తమిళంలో కూడా త్వరలో విడుదల కానుంది చిత్రం.



"కొద్దిసేపు పైన చల్లగాలిలో కూర్చుందామా?" ఫ్రిజ్ ప్రక్కన ఉన్న మట్టి కుండలో నుండి నీరు తీసుకుని తాగుతున్న తులసి వద్దకు వెళ్లి అడిగాడు.

సరే అన్నట్టుగా తలూపింది.

మడత పెట్టి ఉన్న దుప్పటి తీసుకుని అతని వెనుక నడిచిందామె.

మెట్లెక్కి పై అంతస్థులోకి వెళ్లారు. ఓవర్ హెడ్ ట్యాంక్ తప్ప పైన ఇంకేమీ లేదు. పండు వెన్నెల.

మేడమీద ఆహ్లాదకరంగా అనిపించిందతనికి.

"కూర్చోండి" అంది దుప్పటి పరిచి.

నవ్వుతూ కూర్చున్నాడు. పిట్టగోడకు ఆనుకుని నిలబడింది తులసి.

వారి మధ్య ఇంకా సాన్నిహిత్యం ఏర్పడలేదు.

"కూర్చో" చిరునవ్వుతో అన్నాడు.

బిడియంగా కూర్చుంది దుప్పటిమీద కొంచెం దూరంగా.

తలపైకెత్తి కొద్దిసేపు చంద్రుడిని, నక్షత్రాల కాంతిని చూస్తూ గడిపాడు.

"మాట్లాడు తులసీ!"

"ఏం మాట్లాడను?" ఆమె గొంతులో ఒకింత టెన్షన్ తొంగిచూస్తోంది.

అతని పరిస్థితి కూడా అలాగే ఉంది నిజానికి. కానీ తనలోని టెన్షన్ బయటికి వ్యక్తం కాకుండా జాగ్రత్తపడ్డాడు.

"నీ ఇష్టం. ఏ టాపిక్ అయినాసరే" అన్నాడు.

తులసికి గొంతు పెగలలేదు. నిశ్శబ్దంగా కూర్చుండిపోయింది.

కొద్దినిముషాలు గడిచాయి.

"సూర్యుడికి, చంద్రుడికి, నక్షత్రాలకు, పక్షులకు ఈ అంతస్థు ఫ్రీగా ఇచ్చేశారు కదూ!" అతని గొంతులో అల్లరి తొంగిచూసింది.

సంభ్రమంగా చూసిందామె.

"చాలా బాగా చెప్పారు. నేను కూడా ఒకటి రెండుసార్లు అప్రయత్నంగా ఇదేమాట అన్నాను"

అతని ముఖంలో చిరునవ్వు.

"నేను చెప్పినమాట కాదిది. నువ్వన్నమాటే!"

"మీతో నేనెప్పుడు అన్నాను" విస్మయంగా అడిగింది.

"నాతో చెప్పలేదు. మరొకరితో చెబుతుంటే విన్నాను"

ఆరోజు బస్సులో తొలిసారిగా తులసిని చూసిన సంఘటన వివరంగా చెప్పాడు.

సిగ్గుపడిందామె.

భార్య పొడవాటి జడను చేతుల్లోకి తీసుకున్నాడు.

బిడియం తొలిగి ఇద్దరూ కాస్సేపు ముచ్చటించుకున్నారు. ఆమె ముఖంలోకి ఇష్టంగా చూస్తున్నాడు గౌరవ్. నవ్వేటప్పుడు ఆమె బుగ్గమీద కనిపించే సొట్ట మీద మృదువుగా చుంబించాలనిపించిందతనికి.

కొంచెం ముందుకు జరిగాడు.

ఆమెకు అర్థమైంది.

"కిందికి వెళదాం' లేచి నిలబడుతూ అంది.

అతను కూడా లేచాక దుప్పటి మడత పెట్టింది.

పైకి రావడానికి సందేహిస్తూ మొదటి అంతస్థు వరండాలో తచ్చాడుతోంది తులసి తల్లి.

వారు దిగి రావడం చూసి హమ్మయ్య అనుకుంది మనసులో.

గదిలోకి వెళ్లాడతను.

పాలగ్లాసు తీసుకుని మరికొద్ది నిముషాల తర్వాత అతని వద్దకు వచ్చింది తులసి. తనకు చేరువగా కూర్చున్న భార్య చెంపమీద ఇష్టంగా ముద్దుపెట్టుకున్నాడు గౌరవ్.

చంద్రుడు మరింతగా చల్లని వెన్నెల కురిపిస్తున్నాడు.

★